క్లుప్తంగా

పరామర్శ



గణేష్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్న డాక్టర్ తలే రాజేష్

రాజాం: మున్సిపాలిటీ పరిధిలోని డోలపేటకు చెందిన గోకలవలస గణేష్‌ను వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ బుధవారం పరామర్శించారు. ఇటీవల అనారోగ్యానికి గురైన గణేష్.. ఆస్పత్రిలో చికిత్స పొందిన అనంతరం డోలపేటలోని తన ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న డాక్టర్ రాజేష్.. ఉదయం ఆ గ్రామం వెళ్లి, అతడిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఎటువంటి సాయం కావాలన్నా తనను సంప్రదించాలని భరోసా ఇచ్చారు. ఆయన వెంట పార్టీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, జేసీఎస్ కన్వీనర్ పాలవలస గోపి పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



సుహారిక

బొబ్బిలిరూరల్: మండలంలోని శివడవలస హోమియోపతి ఆస్పత్రి వైద్యురాలిగా కె.సుహారిక బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. తన స్వగ్రామం సాలూరు అని, పీజీ పూర్తయిన వెంటనే ప్రభుత్వం పెట్టిన పరీక్షలో ఉత్తీర్ణత సాధించి, ప్రజాసేవకు త్వరగానే అవకాశం రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఇన్‌చార్జ్ డాక్టర్ లక్ష్మి బదిలీపై పార్వతీపురం వెళ్లారు.

రాజశేఖరం మృతికి సంతాపం



సంతాపం ప్రకటిస్తున్న సభ్యులు

రేగిడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో మాజీ రాజ్యసభ సభ్యుడు, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ పాలవలస రాజశేఖరం మృతికి సభ్యులు సంతాపం తెలిపారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. ఆయన లేని లోటు వైఎస్సార్ సీపీకి తీరని లోటు అని ఎంపీపీ దార అప్పలనరసమ్మ, వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత నేత్ర వైద్యశిబిరం

సంతకవిటి: మండలంలోని మండాకురిటి గ్రామంలో భగవాన్ శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్యశిబిరం గురువారం నిర్వహిస్తున్నట్లు సేవా సమితి కన్వీనర్ వెంకన్న ఓ ప్రకటనలో బుధవారం తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆ గ్రామ సచివాలయం వద్ద జరిగే ఈ కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రి వైద్య సిబ్బంది తనిఖీలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేస్తారన్నారు. ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కులగణన సర్వేను వేగవంతం చేయాలి



సర్వేలపై సమీక్షిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజాం సిటీ: కులగణన సర్వేను వేగవంతం చేయాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో బుధవారం సమావేశమైన ఆయన.. పంచాయతీల్లో చేపడుతున్న సర్వేలపై ఆరాతీశారు. అసెస్‌మెంట్స్, నాన్‌ట్యాక్స్ డేటా ఎంట్రీ, పీఆర్ వన్‌యాప్, కులగణన సర్వే, హౌస్‌హోల్డ్ జియో సర్వే, మిస్సింగ్ సిటిజన్ డేటా ఎంట్రీ, సచివాలయ ఉద్యోగుల హాజరు, ఇంటిపన్ను వసూళ్లు, క్లాప్‌మిత్రల పెండింగ్ జీతాలపై సమీక్షించారు. సర్వేలను శతశాతం పూర్తి చేయాలన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



విగ్రహం ఆవిష్కరిస్తున్న దళిత సంఘ నాయకులు, తదితరులు

రేగిడి: మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని బుధవారం ఆవిష్కరించారు. అంబేడ్కర్ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని, ఆయన అనుకున్న సమసమాజ స్థాపన, సామాజిక న్యాయం ఆశయాలు నెరవేర్చాలని సర్పంచ్ కెంబూరు తేజవేంకటేశ్వరరావు, ఎంపీటీసీ ఎర్రన్న అప్పలనాయుడు, సంకిలి పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కెంబూరు గోపాలకృష్ణలతో పాటు దళిత సంఘ నాయకులంతా కోరారు.

తీరాన కోత.. తీరని వ్యథ!



కోతకు గురవుతున్న కొబ్బరితోట

- కోతకు గురవుతున్న నాగావళి తీరం
- నదీగర్భంలో కలిసిపోతున్న పంటభూములు
- కరకట్టల నిర్మాణం నిలిచిపోవడంతో దుస్థితి
- ఆందోళన చెందుతున్న బాధిత రైతులు



రుషింగి వద్ద కోతకు గురైన నాగావళి నదీతీరం

వంగర: వానొచ్చినా, వరదొచ్చినా అక్కడి రైతులకే వణుకే.. ముఖ్యంగా వర్షాకాలం, తుపానుల సమయంలో నాగావళి నది వరదనీటితో పోటెత్తుతుంది. నీటి ప్రవాహ ఉధృతికి తీరం క్రమక్రమంగా కొట్టుకుపోతోంది. ఫలితంగా సమీప పంటపొలాలు నదీగర్భంలో కలిసిపోతున్న దుస్థితి. ఇదీ.. వంగర మండలంలోని వీవీఆర్‌పేట, జేకేగుమ్మడ, పెదరాజులగుమ్మడ, చినరాజులగుమ్మడ, రుషింగి, తలగాం, శివ్వాం, సంగాం, ఓనెఅగ్రహారం తదితర గ్రామాల రైతుల పరిస్థితి. ఏటా కురిసే వర్షాల కారణంగా ఉగ్రరూపం దాల్చే నది ధాటికి పెదరాజులగుమ్మడలోని ఏటిబాడవ, రెల్లిబాడవ భూములతో పాటు సంగాంలోని అగ్రహారంపొలాలు, బందరుగుడ్డి, తలగాం గ్రామాల వద్ద కందిపొలాలు, చినరాజులగుమ్మడలోని దారపురెడ్డివాని పంటపొలాలు మొత్తం కోతకు గురవుతున్నాయి. దీంతో చిన్న, సన్నకారు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

పరిహారం ఇచ్చి ఆదుకోవాలి..

ప్రతీ ఏడాది కురిసే వర్షాలతో నదికి వరదలు వస్తున్న కారణంగా చాలా పంటభూములను రైతులు కోల్పోతున్నారు. అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం. వరదలకు నది కోతకు గురవడంతో తమ పంటపొలాలు కూడా నదీ భాగంలో భాగమైపోతున్నాయి. దీంతో రైతులంతా ఎంతగానో నష్టపోతున్నారు. గతంలో ఓసారి నదీతీర గ్రామాల్లో రెవెన్యూ అధికారులు సర్వే చేసి, గ్రామాల పరిస్థితి, పంటభూములు, నదీతీరం కోతకు గురవుతున్న విషయాలను ఉన్నతాధికారులకు వివరించారు. అయినా నివారణ చర్యలు చేపట్టే దిశగా ఏ కార్యాచరణ ప్రారంభం కాలేదని పలువురు అంటున్నారు.

నిలిచిన కరకట్టల నిర్మాణం..

ఇక్కడ నదీతీరాల గ్రామాలు, భూముల రక్షణ నిమిత్తం నిర్మించే కరకట్టల నిర్మాణం పదేళ్ల క్రితం అర్ధాంతరంగా నిలిచిపోయింది. ప్రధానంగా శివ్వాం, తలగాం, రుషింగి, సంగాం గ్రామాల సమీపంలో నిర్మించాల్సిన గ్రోయిన్స్(కరకట్టలు/వరదకట్టలు) పనులు నిలిచిపోగా, ఇదే మండలంలోని చినరాజులగుమ్మడ గ్రామ సమీపంలో 50 మీటర్ల దూరం వరకు ఈ కరకట్టల నిర్మాణం చేసి, ఆ పనులు నిలిపివేశారు. దీంతో బాధిత గ్రామాల రైతులు గగ్గోలు పెడుతున్నారు. తమ భూములను పరిరక్షించాలని కోరుతున్నారు. వరదకట్టల నిర్మాణం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మండల సమావేశం వాయిదా

రేగిడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. ప్రధానంగా రోడ్ల నిర్మాణాలపై సభ్యులు ఈ సమావేశంలో చర్చించాలనుకున్నారు.. అయితే అటు ఆర్‌అండ్‌బీ అధికారులు.. ఇటు పంచాయతీరాజ్ జేఈ తదితర అధికారులెవరూ సమావేశానికి రాకపోవడంతో సభ్యులు సదరు అధికారుల తీరుపై మండిపడుతూ సభ వాయిదాకు పట్టుబట్టారు. సమావేశంలో చర్చ జరగాల్సిన శాఖల ప్రధాన అధికారులే రాకపోతే సమావేశం ఎలా నిర్వహించాలని ఎంపీపీ దార అప్పలనరసమ్మ సభను వాయిదా వేశారు. అన్ని శాఖల అధికారులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండే రోజు సమావేశం నిర్వహించేందుకు సభ్యులు తీర్మానం చేశారు.



మండల సమావేశంలో పలువురు అధికారుల గైర్హాజరుతో ఖాళీగా కనిపిస్తున్న కుర్చీలు

పోలిపల్లి పైడితల్లి ఆదాయం రూ.1.57 లక్షలు



హుండీల కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

రాజాం సిటీ: స్థానిక బొబ్బిలి రోడ్డులోని పోలిపల్లి పైడితల్లి ఆలయ హుండీల ఆదాయం బుధవారం లెక్కించారు. 63 రోజులకు గాను రూ.1,57,097లు సమకూరిందని ఆలయ ఈవో బీవీ మాధవరావు తెలిపారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు పి.శ్యామలరావు, ఆలయ ధర్మకర్త వాకచర్ల దుర్గాప్రసాద్, అర్చకుడు సూర్యనారాయణశర్మ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఆధార్ చేయించాలి

బాడంగి: ఆరేళ్ల వయసులోపు చిన్నారులకు ఆధార్ నమోదు చేయించాలని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ సూచించారు. ఇదే విషయమై ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని తన కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలో మొత్తం 402 మంది చిన్నారులు ఉన్నారని, వారందరి పేరిట ఆధార్ కార్డు ఉండి తీరాలన్నారు. గజరాయునివలస గ్రామ సచివాలయంలో ప్రత్యేకంగా ఆధార్ సేవలు ప్రారంభించి, చిన్నారుల ఆధార్ కార్డుల తయారీ జరుగుతోందన్నారు. ఈ అవకాశాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'వన్‌స్టాప్' సేవలు సద్వినియోగం చేసుకోవాలి

బొబ్బిలి: వన్‌స్టాప్ సెంటర్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని సెంటర్ కేస్‌వర్కర్ తాన్న అనిత కోరారు. స్థానిక పట్టణంలోని నోబుల్ స్కూల్, రిషి జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు వన్‌స్టాప్ సెంటర్ సేవలపై బుధవారం అవగాహన కల్పించారు. ఆపదలో ఉన్న బాలికలు, యువతులు, మహిళలను రక్షించడమే లక్ష్యంగా ఏర్పాటైన ఈ సెంటర్ సేవలు పొందాలంటే టోల్‌ఫ్రీ నంబర్లు 1098, 181, 112, 1930లను సంప్రదించాలన్నారు.

దుస్తుల వితరణ

బొబ్బిలి: పట్టణంలో విశాఖ–రాయ్‌పూర్ మూడో రైల్వే లైన్ పనులు చేసుకుంటున్న పలువురు కూలీలకు స్థానిక వనమిత్ర అధ్యక్షుడు కె.కృష్ణదాసు మాస్టారు బుధవారం దుస్తులు వితరణ చేశారు. చలికాలం నేపథ్యంలో 25 మందికి వారి నివాస స్థలాల వద్దకు వెళ్లి, వస్త్రాలను అందజేశారు.

చురుగ్గా పారిశుధ్య పనులు

తెర్లాం: మండలంలోని చీకటిపేట గ్రామంలో పారిశుధ్య పనులు చాలా చురుగ్గా జరుగుతున్నాయి. ఎంపీడీవో రాంబాబు, ఈవోపీఆర్‌డీ నీలిమ ఆదేశాల మేరకు సర్పంచ్‌ల ఆధ్వర్యంలో వీధుల్లో, కాలువల్లో దోమల నివారణకు చర్యలు చేపట్టారు. ప్రజలంతా ఇళ్లముందు ఉన్న కాలువలను శుభ్రం చేసుకోవాలని, వాడుకనీరు కాలువలో నిల్వ ఉండకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

రాజాం: మండలంలోని ప్రతీ పంచాయతీ పరిశుభ్రంగా ఉండాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని అంతకాపల్లి గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనులను ఆయన బుధవారం పరిశీలించారు. ఇంటి నుంచి సేకరించిన చెత్తను సంపద తయారీ కేంద్రాలకు తరలించి, సేంద్రియ ఎరువు తయారు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వాకముల్ల చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గ్రామగ్రామాన పశువైద్య సేవలు



బొబ్బిలిరూరల్: చింతాడలో పశువైద్య శిబిరంలో వైద్య సిబ్బంది సేవలు



సంతకవిటి: ఎం.ఆర్.అగ్రహారంలో ఆవు చూడి తనిఖీ చేస్తున్న పశువైద్యాధికారి ఆశ



బాడంగి: గొల్లాదిలో ఆవుదూడ నోటిలో నట్టల నివారణ మందు వేస్తున్న వైద్యుడు సతీష్



రేగిడి: ఖండ్యాంలో పశువైద్య తనిఖీలు



తెర్లాం: కుసుమూరులో పశువైద్య తనిఖీలు నిర్వహిస్తున్న మండల పశువైద్యాధికారి నరేంద్రకుమార్

తెర్లాం/బాడంగి/బొబ్బిలిరూరల్/రేగిడి/సంతకవిటి: అన్ని మండలాల్లోని గ్రామాల్లో ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. బుధవారం పలు గ్రామాల్లోని శిబిరాల్లో పశువులు సహా గొర్రెలు, మేకలు, కోళ్లు వంటి మూగజీవాలకు పశువైద్య సిబ్బంది ఆరోగ్య తనిఖీలు చేపట్టి, అవసరమైన వాటికి ఉచితంగా మందులు అందజేశారు. అలాగే వ్యాధుల నివారణకు ముందస్తు జాగ్రత్తగా టీకాలు, నట్టల నివారణ మందులు వంటివి వేశారు. ఏదైనా వ్యాధి లక్షణాలతో మూగజీవాలు బాధపడితే వైద్యులను సంప్రదించి, సలహాలు, సూచనలు పొందాలని వైద్యాధికారులు సూచించారు.

గ్రామాభివృద్ధికి సహకరించాలి

బాడంగి: మండలంలోని పూడివలస గ్రామంలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఎంపీడీవో ఎస్.రామకృష్ణ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులంతా సహకరించాలని కోరారు. అన్ని విధాలా గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు తోడ్పాటును అందించాలన్నారు. అనంతరం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఉల్లాస్‌పై గురువారం శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన ర్యాలీ

రాజాం: క్షయవ్యాధి నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని క్షయవ్యాధి నివారణ విభాగం డివిజనల్ సూపర్‌వైజర్ లలిత కోరారు. మండలంలోని పెనుబాక, బొద్దాం, సోపేరు తదితర గ్రామాల్లో జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు, ఆయా పంచాయతీల సర్పంచ్‌లతో కలిసి క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన ర్యాలీ బుధవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ క్షయ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని, కోరింత దగ్గు, కెల్లలు అధికంగా పడడం వంటివి వ్యాధి లక్షణాలని వాటిని ఆరంభంలోనే గుర్తిస్తే నయం చేసుకోవచ్చన్నారు. అనంతరం వ్యాధి నివారణపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో బొద్దాం పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ సిద్ధీశ్వరి, డాక్టర్ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.



పెనుబాకలో ప్రతిజ్ఞ చేయిస్తున్న జెడ్పీటీసీ నర్సింహులు

దాడి ఘటనపై కేసు నమోదు

బాడంగి: మండలంలోని డొంకినవలస రైల్వే ఎత్తుఖానా సమీపంలోని ఓ మద్యం షాపు వద్ద చిరువ్యాపారి వడ్డి మధు, ఆయన సోదరుడు సురేష్‌లపై కొంతమంది దాడికి ఎగబడిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తారకేశ్వరరావు బుధవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. వైన్ షాపు ఎదురుగా ఓ షాపు నిర్వహిస్తూ అందులో మందుబాబులకు అవసరమైన వాటర్ ప్యాకెట్లు, బాటిళ్లు, వేరుశనగ ప్యాకెట్లు, గవ్వలు, చేగోడియాలు వంటి స్టఫ్‌ను మధు విక్రయిస్తుంటాడు. అయితే మంగళవారం రాత్రి అక్కడికి వచ్చిన పెదపల్లికి చెందిన ఆవు నర్సింహులు, ప్రసాద్, రొంపిల్లికి చెందిన సారిక మోహన్, సాలూరుకు చెందిన బెవర గణేష్‌లను ఇంతకుముందు తనకు ఇవ్వాల్సిన బాకీ డబ్బులు ఇవ్వాలని మధు అడిగాడు. ఈ క్రమంలో జరిగిన వాగ్వాదంలో మధు, అతడి సోదరుడు సురేష్‌లపై సదరు వ్యక్తులు భౌతికదాడికి పాల్పడ్డారు. ఈ క్రమంలో సురేష్‌కు గాయాలు కాగా వైద్యసేవల నిమిత్తం స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విజయనగరం ప్రభుత్వాస్పత్రికి రిఫర్ చేశారు. క్షతగాత్రుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. అయితే వైన్ షాపుల వద్ద తాగేందుకు అనుమతులు ఇవ్వడంతోనే ఇలా గొడవలు జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.

ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి



ప్రతీ దుకాణానికి ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో రత్నం ఆదేశించారు. రామభద్రపురం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో బుధవారం సమావేశమైన ఆమె.. చిన్నాపెద్దా అనే తేడా లేకుండా ప్రతీ దుకాణానికి వెళ్లి, ట్రేడ్ లైసెన్స్ ఉన్నదీ లేనిదీ సర్వే చేయాలని సూచించారు. అలాగే ఇంటి పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని, గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, రానున్న వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సదుపాయం ఉండేలా చూడాలన్నారు. – రామభద్రపురం

ఇళ్లస్థలాలు స్వాధీనం చేసుకుంటాం..



జగనన్న కాలనీల్లో ఇంటి స్థలం, పట్టా పొంది ఇంటి నిర్మాణం చేయకపోతే ఆ ఇళ్లస్థలాలను స్వాధీనం చేసుకుంటామని తహసీల్దారు సులోచన రాణి హెచ్చరించారు. రామభద్రపురం మండలం, ఎస్.చింతలవలస గ్రామంలోని జగనన్న కాలనీ లేఅవుట్‌లో నిర్మాణాలు ప్రారంభించని ఇళ్లస్థలాలను ఆమె బుధవారం పరిశీలించారు. సర్వే నంబరు 148లో 565 మంది నిరుపేదలకు ప్రభుత్వం అప్పట్లో ఇళ్లస్థలాలు ఇచ్చిందని, అయితే ఇప్పటివరకు 71 మంది నిర్మాణాలు ప్రారంభించలేదన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇంటిస్థలం ఇచ్చిన ఆరు నెలల్లో నిర్మాణం ప్రారంభించకపోతే పట్టా రద్దు చేసి, స్థలం స్వాధీనం చేసుకోవడం జరుగుతుందన్నారు. ఈ నెలాఖరులోపు నిర్మాణాలు ప్రారంభించాలని కోరారు. –రామభద్రపురం

ఉపాధ్యాయుల నిరసన



విద్యాశాఖ జారీ చేసిన జీవో నంబరు 117 సవరణ మెమోలోని అసంబద్ధాలను తొలగించాలని యూటీఎఫ్ మండల అధ్యక్షుడు ఎం.ప్రసాద్ డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన పలువురు ఉపాధ్యాయులతో కలిసి వంగర మండల కేంద్రంలో బుధవారం నిరసన చేపట్టారు. ప్రతి పంచాయతీకి ఓ మోడల్ ప్రైమరీ పాఠశాల ఏర్పాటు చేయడంతో పాటు అన్ని ప్రాథమిక పాఠశాలల్లో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు చొప్పున ఉండేలా చూడాలన్నారు. అలాగే ప్రాథమికోన్నత పాఠశాలలను కొనసాగించాలని, వాటిల్లో సబ్జెక్టు టీచర్లను నియమించాలని, ఉపాధ్యాయులు, విద్యార్థి నిష్పత్తి తగ్గించాలని కోరారు. –వంగర

అంధకారంలో ఎం.సీతారాంపురం



వంగర మండలం, ఎం.సీతారాంపురం గ్రామ ఎస్సీ కాలనీవాసులు అంధకారంలో మగ్గిపోతున్నారు. కొన్నిరోజులుగా అక్కడి వీధి దీపాలు వెలగకపోవడంతో చీకటిలో బతకాల్సి వస్తోందని గ్రామస్తుడు మడపల బాబూరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, విద్యుత్ దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. –వంగర

మోక్షప్రదాయిని భగవద్గీత



మాట్లాడుతున్న ఆధ్యాత్మిక వక్త ఎన్వీ రమణ

రేగిడి: మండలంలోని దేవదళ గీతామందిరంలో గొర్లె దామోదరరావు ఆధ్వర్యంలో దివ్యజీవన సత్సంగం బుధవారం జరిగింది. పాలకొండకు చెందిన ఆధ్యాత్మిక వక్త ఎన్వీ రమణ భగవద్గీత గొప్పతనం భక్తులకు వివరించారు. భగవద్గీత మోక్షప్రదాయిని అని, భగవద్గీత పఠిస్తే చెడుగీతలు చెరిగిపోతాయన్నారు. ప్రతిఒక్కరూ బిజీ జీవితంలో పడి ఆధ్యాత్మిక కార్యక్రమాలకు సమయం కేటాయించడం లేదన్నారు. ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత అని, అందరూ దైవనామస్మరణ చేసుకోవాలన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో నిత్య స్మరణానందస్వామి, ఎం.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై దృష్టిసారించాలి

బాడంగి: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో తహసీల్దారు కె.సుధాకర్ బుధవారం సమావేశమై, పలు సూచనలు చేశారు. రెవెన్యూ సదస్సుల్లో అధికారుల దృష్టికి వచ్చిన ప్రతీ రైతుల భూ సమస్యల పరిష్కారంపై దృష్టిసారించాలని తెలిపారు. సమావేశంలో హెచ్‌డీటీ ధనం, రీసర్వే డీటీ అప్పలనాయుడు, వీఆర్వో దేవి తదితరులు పాల్గొన్నారు.

రోజుకు రూ.300 గిట్టుబాటు అయ్యేలా పనులు



రాజాం సిటీ: సూచనలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు తదితరులు

తెర్లాం: ఉపాధి హామీ పథకం పనుల ద్వారా వేతనదారులకు రోజుకు రూ.300 వేతనం గిట్టుబాటు అయ్యేలా పనులు చేయించాలని ఎంపీడీవో రేగి రాంబాబు అన్నారు. ఉపాధి పనుల్లో భాగంగా మండల కేంద్రంలో జరుగుతున్న ఫీడర్ చానల్ పనులను ఆయన బుధవారం తనిఖీ చేశారు. సాంకేతిక, క్షేత్ర సహాయకులు ఇచ్చిన కొలతల ప్రకారం వేతనదారులు పనులు చేయాలన్నారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతీ వేతనదారునికి పని కల్పించాలన్నారు. పనిలోకి వచ్చిన వారికే మస్తరు వేయాలన్నారు. ఆయన వెంట ఏపీవో సుశీల తదితరులు పాల్గొన్నారు.

రాజాం సిటీ: స్థానిక ఉపాధి హామీ పథకం కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో ఎంపీడీవో వి.శ్రీనివాసరావు బుధవారం సమావేశమై, పలు సూచనలు చేశారు. ఉపాధి పనుల్లో భాగంగా ఫారంపాండ్స్, ఫిష్ పాండ్స్, సోక్‌పిట్స్, ట్రెంచ్‌వర్క్‌లను చేయాలన్నారు. వేతనదారులకు 100 రోజుల పాటు పని కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో కె.సాయిరాం తదితరులు పాల్గొన్నారు.